క్లుప్తంగా

మద్దిలేరు బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టండి



ఎంపీపీ ఆదినారాయణకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ముదిగుబ్బ: గతంలో కొడవండ్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న మద్దిలేరు వంకపై నిర్మించిన బ్రిడ్జి గతంలో వరద ఉధృతికి కొట్టుకుని పోయింది. అయితే అప్పట్లో ఈ బ్రిడ్జికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అయితే నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై నిర్మించిన బ్రిడ్జికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. శనివారం ఎంపీపీ ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యను మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముదిగుబ్బ: మండల పరిధిలోని గుడ్డంపల్లి తండాకు చెందిన న్యాయవాది చత్రేనాయక్ పిల్లలు లహరి, లక్ష్మీనరసింహులు పుట్టిన రోజు సందర్భంగా శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పక్రుద్దీన్, నరసింహులు, మునేనాయక్, నారాయణ స్వామి నాయక్, నిర్మల, సాయిలీల, వరలక్ష్మి, సుశీల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణాంకాల దినోత్సవం



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ గణాంకాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపాల్ ఫణి కుమార్, డైరెక్టర్లు అక్రమ్, డాక్టర్ సుబ్బారావు, పోలా ప్రభాకర్, బీఆర్ రంగనాథ్, రమణ విద్యార్థులతో కలిసి కేక్ చేశారు. విద్యార్థులకు గణాంకాల దినోత్సవం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు



చిరుధాన్యాలను చూపుతున్న కన్వీనర్ శరత్ కుమార్ రెడ్డి

కదిరి టౌన్: జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు చిరు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్ కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సారవంతమైన నేలలు ఉండగా.. వేరుశనగ విపరీతంగా సాగు చేయడం వల్ల భూసారం నశించిపోయిందన్నారు. ఇప్పుడు రైతులు వేరుశనగ సాగు చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశనగ సాగు చేసిన రైతులకు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. వాతావరణ పరిస్థితుల దృష్టిలో ఉంచుకుని జిల్లాలో చిరుధాన్యాలైన సామలు, కొర్రలు, అరకలు, అండు కొర్రలు సాగు చేయాలని సూచించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఓడీచెరువు: అల్ట్రా విజన్ ఐ కేర్ హాస్పిటల్స్ డాక్టర్ బొగ్గు సురేష్, మా మెడికల్స్ ఫిరోజ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు, గోరంట్ల మండలాల నుంచి వచ్చిన 133 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో శస్త్ర చికిత్సలు అవసరమైన 26 మందికి పుట్టపర్తిలోని అల్ట్రా విజన్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, రాజేష్, అనిత,అమృత వర్షిణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పుష్కలంగా ఎరువులు

గాండ్లపెంట: మండల రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు గాండ్లపెంట, వేపరాల, కటారుపల్లి, మలమీదపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ లక్ష్మీప్రియ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఏపీ బస్తా ధర రూ.1,350, యూరియా బస్తా ధర రూ.267, కాంప్లెక్స్ ఎరువులు రూ.1,150 చెల్లించాలన్నారు. ఎరువులు అవసరమైన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

రాజీ మార్గంతో కేసుల పరిష్కారం



ధర్మవరం అర్బన్: ఇరువర్గాలను రాజీ చేస్తున్న జడ్జిలు గీతావాణి, రమ్యసాయి



పుట్టపర్తి రూరల్: మాట్లాడుతున్న జడ్జి రాకేష్

పుట్టపర్తి రూరల్: లోక్ అదాలత్ ద్వారా 116 కేసులు పరిష్కరించినట్లు పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జ్ రాకేష్ తెలియజేశారు. శనివారం పుట్టపర్తి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఐపీసీలు, 105, చెక్ బౌన్స్ 2 కేసుల్లో 34 లక్షల మెత్తానికి బ్యాంక్ రుణాలకు సంబంధించి పీఎల్‌సీ 4 కేసుల్లో 3.65 లక్షలు మెత్తానికి మద్యం కేసులు 2, మనీ స్యూట్స్ 3 కలుపుకుని మెత్తం 116 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. చిన్నపాటి మనస్పర్థలు తగాదాలు పట్టింపులకు పోయి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగొద్దని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు యదుభూషన్, రాజేంద్రప్రసాద్ రెడ్డి, ఇందిరా, కృష్ణప్రసాద్, శ్రీనివాసులు లోక్ అదాలత్ సభ్యులు నాగేంద్ర, జయభారతీ రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్యానాయక్, సురేష్ కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకుని సంతోషంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మురళి సూచించారు. శనివారం ధర్మవరంలోని కోర్టులో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. జడ్జిల ముందు పలు కేసుల్లోని కక్షిదారులు రాజీ అయ్యారు. ఈ లోక్ అదాలత్‌లో 109 కేసులు పరిష్కరించారు. బ్యాంకు రుణాలు 3 (రూ.12.81 లక్షలు), బీఎస్ఎన్ఎల్ కేసులు 3 (రూ.4053), సివిల్ కేసులు 3 (రూ.8 లక్షలు), గొడవ కేసులు 54, ఇసుక రవాణా కేసులు 7 (రూ.15 వేలు), భరణం కేసులు 3 (రూ.16 లక్షలు), చెక్‌బౌన్స్ కేసులు 1 (రూ.2.50 లక్షలు), పెట్టి కేసులు 35 (రూ.2.23 లక్షలు) మొత్తం 109 కేసులు పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'రూ.30 లక్షలతో అగ్రిమెంట్ చేసి మోసం చేశారు'

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని సైదాపురం పొలం సర్వే నంబర్ 245–1బీ1లో 2.87 ఎకరాల భూమి విక్రయిస్తామని చెప్పి లాయర్ రామస్వామి నాయుడు మోసం చేశారని కదిరి అడపాలవీధికి చెందిన తలుపుల గంగాధర్ ఆవేదన వ్యక్తం చేశారు. సదరు భూమిని రూ.1,15,00,000లకు కొనుగోలు చేసేందుకు ఒప్పుకుని నాలుగేళ్ల కిత్రం అగ్రిమెంట్ చేయించుకున్నట్లు తెలిపారు. ఇందుకు అడ్వాన్స్‌గా రూ.30 లక్షలు చెల్లించినట్లు పేర్కొన్నాడు. ఇటీవల సదరు భూమిని చదును చేసేందుకు వెళ్లినప్పుడు వేరే వ్యక్తులు ఆ భూమి తమదే అంటూ అడ్డుకున్నారని తెలిపారు. ఈ విషయంపై లాయర్ రామస్వామి నాయుడును అడిగితే డబ్బు వెనక్కి ఇచ్చేస్తానని చెప్పాడన్నారు. అయినా నేటికీ డబ్బు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో శుక్రవారం లాయర్ రామస్వామి నాయుడు, తలుపుల గంగాధర్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపంతో ఊగిపోయిన లాయర్ రామస్వామి నాయుడు 'నేను లాయర్‌ను, కేసులు పెట్టిస్తే నిన్ను బొక్కలో వేయిస్తా' అంటూ దుర్భాషలాడినట్లు గంగాధర్ తెలిపారు. అనంతరం న్యాయం చేయాలని కోరుతూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వికలాంగులకు పింఛన్ బకాయిలు చెల్లించాలి

ముదిగుబ్బ: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా వికలాంగులకు కూడా మూడు నెలల బకాయిలతో కలిపి పింఛన్ సొమ్ము అందజేయాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బకాయిలతో కలిపి జనరల్ కేటగిరీ పింఛన్ దారులకు రూ.7 వేలు, అలాగే వికలాంగులకు రూ.15 వేలు ఇస్తామని అప్పట్లో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారని గుర్తు చేశారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న మీటర్ రీడర్లు

ధర్మవరం రూరల్: మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పెనుకొండలో మంత్రి సవితను మీటర్ రీడర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. మీటర్ రీడర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. మా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దస్తగిరి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శావ్నాజ్, బీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా మాస్‌మీడియా ఆఫీసర్ బాబాఫక్రుద్దీన్

ధర్మవరం అర్బన్: లింగ నిర్ధారణ చేస్తే చట్టపరంగా శిక్షలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సోలోమన్, టూటౌన్ సీఐ అశోక్ కుమార్, గైనకాలజిస్ట్ శైలజ తెలిపారు. స్థానిక డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో శనివారం పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మవరం డివిజన్‌లో 11 స్కానింగ్ సెంటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో 2 ప్రభుత్వ ఆసుపత్రుల్లో 9 ప్రైవేటు సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడ పిల్లలు అయితే అబార్షన్లు చేయడం వంటివి చట్ట వ్యతిరేకమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, సురేష్‌నాయక్, శ్రావణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ బాబాఫక్రుద్దీన్, రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, అన్నమయ్య సేవా సమితి అధ్యక్షుడు పుల్లయ్య, అప్పయ్యసేవా కమిటీ సభ్యులు అన్నా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీడి కార్మికుల సమస్యలపై పోరాడదాం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు

కదిరి టౌన్: పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం సీఐటీయూ పట్టణ మహాసభలు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు హాజరై మాట్లాడారు. ఐక్యత పోరాటాం అనే నినాదంతో అన్ని రంగాల కార్మికులను ఐక్యం చేస్తూ అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్ పేరుతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్మికులు, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ చేసిన నీచమైన రాజకీయాలకు దేశ ప్రజలు ఈసారి ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. కదిరిలో బీడి కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి ఐక్యంగా పోరాడాలన్నారు. పట్టణ కమిటీని 23 మందితో ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా జగన్‌మోహన్, కో–కన్వీనర్లుగా రామ్మోహన్, ముస్తాక్, మాబునీసా మిగతా 19 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

నిస్వార్థ సేవలతోనే నిజమైన గుర్తింపు



ఉపాధ్యాయులు చెన్నకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డితో పాఠశాల సిబ్బంది



వెండి రథంలో ఊరేగింపుగా బుక్కపట్నానికి వస్తున్న ఉపాధ్యాయులు చెన్నకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి



హరిమోహన్ దంపతులను సన్మానిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగి తన జీవిత కాలంలో అంకిత భావంతో పని చేస్తే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని సీపీఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఓ (గణాంక శాఖ అధికారి) రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక సాయి ఆరామంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రమేష్ జీవితం సుఖమయం కావాలన్నారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగి జీవితంలో ముఖ్యమైన మైలురాయి అన్నారు. అనంతరం రమేష్ దంపతలకు నూతన వస్త్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏడీ ప్రకాష్, ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, మాజీ ఎన్‌జీఓ నాయకులు నరసయ్య, డీవైఎస్ఓ పద్మావతి, సాయిప్రసాద్, ఎస్ఓ అంజాద హుస్సేన్, భీసీం తదితరులు పాల్గొన్నారు.

వెండి రథంలో ఉపాధ్యాయుల ఊరేగింపు

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం కేశాపురం ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు చెన్నకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి దంపతులను పాఠశాల సిబ్బంది, బంధువులు ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. వీరి సేవలకు గుర్తుగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కేశాపురం నుంచి 15 కిలోమీటర్ల దూరంలో బుక్కపట్నం టీచర్స్ కాలనీలో వారి ఇళ్ల వరకు వెండి రథంలో ఊరేగించి వీడ్కోలు పలికారు. చెన్నకృష్ణారెడ్డి పని చేసిన చెర్లోపల్లి, నారేపల్లి చదువుకున్న సిద్దరాంపురం పాఠశాలలను తోటి మిత్రులు, సత్యసాయి భక్తుల సహాయంతో రూ.లక్షలు ఖర్చు చేసి కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా తీర్చిదిద్దారు. హనుమంతరెడ్డి వృత్తే దైవంగా భావించి విద్యార్థులకు చక్కగా బోధించారని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రారెడ్డి సర్పంచ్ నరేందర్ రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నేతలు రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, మాధవ్, డైట్ విశ్రాంత్ ప్రిన్సిపాల్ మునయ్య, రిటైర్డ్ ఎంఈఓలు నాగిరెడ్డి, నగేంద్ర, హెచ్ఎంలు నారపరెడ్డి, రియాజ్ పాల్గొన్నారు.

వీఆర్ఓకు వీడ్కోలు

తలుపుల: మండలంలోని పులిగుండ్లపల్లి వీఆర్ఓగా పని చేసిన నారాయణ దంపతులకు తహసీల్దార్ రామకుమారి ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు పలికారు. దుశ్శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, పులిగుండ్లపల్లి సచివాలయ ఉద్యోగులు,పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓకు సన్మానం

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగ విరమణ పొందిన కలెక్టరేట్ ఏఓ (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) రామాంజనేయరెడ్డిని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ కలెక్టరేట్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వచ్చిన అనతి కాలంలోనే అందరి మన్ననలు పొందిన రామాంజనేయరెడ్డి, శేష జీవితం సుఖమయం కావాలన్నారు. ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ సాధారణం అన్నారు. జీవితంలో చేసిన మంచి పనులు జీవితాంతం గుర్తుండి పోతాయని పేర్కొన్నారు.అనంతరం రామాంజనేయరెడ్డి దంపతులకు జ్ఞాపికలు అందజేశారు. దుశ్శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి మైనుద్దీన్ పాల్గొన్నారు.

హరిమోహన్ సేవలు ప్రశంసనీయం



ఏఓ రామాంజనేయరెడ్డి దంపతులను సత్కరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్ తదితరులు

కదిరి అర్బన్: కదిరి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ సేవలు ప్రశంసనీయమని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ ఉద్యోగ విరమణ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ మాట్లాడుతూ.. కదిరి డిపోలో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపడంలో హరిమోహన్ సేవలు ఎంతో కీలకమన్నారు. డిపో ఆదాయం పెంచేందుకు ఆయన కృషి మరువలేనిదన్నారు. అనంతరం దుశ్శాలువాతో హరిమోహన్‌ను సన్మానించారు. డీఎం మైనుద్దీన్ పాల్గొన్నారు.

కనగానపల్లి: తెలుగు పండితుడు చాగంటి నాగేంద్రరెడ్డి చేసిన సేవలు ఎనలేనివని మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం స్నేహలత కొనియాడారు. మండలంలోని మామిళ్లపల్లి జెడ్పీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగేంద్రరెడ్డి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. స్థానిక పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.



తలుపుల: వీఆర్ఓ దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది



రమేష్‌ను సత్కరిస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు



ఉపాధ్యాయుడు నాగేంద్రరెడ్డిని సన్మానించిన దృశ్యం

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల ఆందోళన



ప్రిన్సిపాల్ సుస్మిత జ్యోత్స్నకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

తనకల్లు: మండలంలోని సీజీ ప్రాజెక్టు గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు శనివారం విధులను బహిష్కరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము గత 15 ఏళ్లుగా గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో తక్కువ జీతాలకే పొరుగు సేవల ఉపాధ్యాయులుగా పని చేస్తున్నామన్నారు. అయితే నూతన ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో గిరిజన గురుకులాలల్లో 1,147 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా చూపించిందన్నారు. తమ పోస్టులను కూడా డీఎస్సీలో ఖాళీలుగా చూపడం తగదన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న 1,680 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకుల కుటుంబాలు వీధిన పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలకు భరోసా ఇచ్చేంత వరకు విధులకు హాజరుకాబోమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత జ్యోత్స్నకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మేరీ వట మట్టమ్

చెన్నేకొత్తపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఆదిశక్తి సొసైటీ 27వ వార్షిక మహాసభను శనివారం స్థానిక సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టింబక్టు కలెక్టివ్ సంస్థ చైర్మన్ గంగూలీ, సెక్రటరీ మేరీ వట్ట మట్టమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మేరీ వట మట్టమ్ మాట్లాడుతూ, ఆదిశక్తి సొసైటీ 3 మండలాల పరిధిలోని 90 గ్రామాల మహిళలతో కలసి పని చేస్తోందన్నారు. మహిళలను పొదుపు సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సొసైటీ సహకారం అందిస్తోందన్నారు. అదేవిధంగా నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళల్లో చైతన్యం తీసుకువస్తోందన్నారు. ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత వార్షిక నివేదికను, సొసైటీ చేపడుతున్న కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.